క్లుప్తంగా

రేపు కార్యకర్తలకు అందుబాటులో బుర్రా

కందుకూరు: వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ కందుకూరులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి అందుబాటులో ఉండనున్నారు. ఈ మేరకు బుధవారం వైఎస్సార్ సీపీ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కార్యాలయంలోబుర్రాను కలవవచ్చని తెలిపారు.

రైతులు అధికారుల సూచనలు పాటించాలి

కనిగిరి రూరల్: నిమ్మ, బత్తాయి, పండ్లతోటల రైతులు తమ సలహాలు, సూచనలు పాటించాలని ఉద్యానవన శాఖాధికారి ఎం.అంజలి బాయి సూచించారు. మండలంలోని తుమ్మగుంట గ్రామంలో నిమ్మతోటలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖాధికారి అంజలి మాట్లాడుతూ రైతులు సస్య రక్షణ చర్యలు పాటించాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో వచ్చే నిమ్మ తెగుళ్లు, వాటి నివారణ చర్యల గురించి తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు ఎస్‌కే మహబూబ్ ప్యారీ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం


మర్లపాడులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

టంగుటూరు: మండలంలోని మర్లపాడు గ్రామంలో విద్యుత్ స్తంభం విరిగి ప్రమాదకరంగా తయారైంది. కొణిజేడు నుంచి మర్లపాడు వెళ్లే ఆర్‌అండ్‌బీ మెటల్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న సచివాలయం, రైతు భరోసా కేంద్రం సమీపంలో విద్యుత్ స్తంభం విరిగినా ఆ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. నిత్యం ఇదే మార్గంలో పాఠశాలల బస్సులు, ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు ఈ మార్గాన్నే అధికంగా వినియోగిస్తారు. విరిగిన విద్యుత్ స్తంభం ఎప్పుడు మీద పడుతుందోనని వాహనదారులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వాయనాడ్ వరద బాధితులను ఆదుకుందాం


సింగరాయకొండలో విరాళాలు సేకరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సింగరాయకొండ: కేరళ రాష్ట్రంలోని వాయనాడ్ ప్రాంతంలో వరదల కారణంగా నష్టపోయిన ప్రజలకు ఆపన్నహస్తం అందించాలని కోరుతూ బుధవారం జనవిజ్ఞాన వేదిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జనవిజ్ఞానవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ హరిబాబు పాల్గొని ర్యాలీని ప్రారంభించి తమ వంతు ఆర్థిక సహాయం అందజేశారు. మెయిన్ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించి విరాళాలు సేకరించారు. టంగుటూరు రాము, టి.రామ్మూర్తి, విశ్రాంత ఉపాధ్యాయుడు కోటపాటి నారాయణ, పి.రవికుమార్, అంబేడ్కర్ విగ్రహ కమిటీ సభ్యుడు పి.కృష్ణయ్య, నక్కా మాల్యాద్రి, బి.లక్ష్మణ్, నాగార్జున, సురేష్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి

పామూరు: ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించి ఆటోలు నడపాలని, నిబంధనలు పాటించకుండా ఆటోలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం.రామానాయక్ హెచ్చరించారు. స్థానిక సర్కిల్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం సీఐ ఎం.రామానాయక్ ఆధ్వర్యంలో మండలంలోని ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలు, ఇటీవల జరుగుతున్న నేరాలకు సంబంధించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని, యూనిఫాం విధిగా వేసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఎస్సై ఎం.సైదుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం మిన్న


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న రూన్సీ, రంజిత్

కొండపి (సింగరాయకొండ): కొండపి మండలం పెరిదేపిలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై న్యాచురల్ ఫార్మింగ్ ఏడీ రూన్సీ బుధవారం అవగాహన కల్పించారు. పంటలకు కషాయాలను ఏ దశలో వినియోగించాలి, రసాయనాల వాడకంతో కలిగే నష్టాలను వివరించారు. దశపర్ణి, ఇతర కషాయాల గురించి తెలియజేసి స్వయంగా తయారు చేయించారు. యూనిట్ ఇన్‌చార్జ్ రంజిత్ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంతో 365 రోజులు ఆదాయం పొందవచ్చని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి దగ్గర ఖాళీ స్థలంలో ప్రకృతి వ్యవసాయం చేసుకుంటూ ఎనీ టైం మనీ సంపాదించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్పీఎస్‌లు గౌతమి, సుజాత, మాలకొండయ్య, చౌదరి, గ్రూప్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల సమరం నేడే..

- నియోజకవర్గంలోని 458 ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహణకు సర్వం సిద్ధం
- సమస్యాత్మక స్కూళ్ల వద్ద పోలీస్ ప్రొటెక్షన్


ప్రభుత్వ ఉన్నత పాఠశాల

కనిగిరి రూరల్:

ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీల స్థానంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పాఠశాల యాజమాన్య కమిటీల (ఎస్‌ఎంసీ) ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. గత నెల 31న నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెలలో పాఠశాలల్లో ఓటర్ల జాబితా ప్రచురణ, తదితర ప్రక్రియలు పూర్తయ్యాయి. ఆ మేరకు ఈ నెల 8వ తేదీ ప్రభుత్వ, ఎయిడెడ్, మోడల్ స్కూల్, కేజీబీవీల్లో ఎస్‌ఎంసీ కమిటీల ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. కనిగిరి నియోజకవర్గంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 458, వాటిలో సుమారు 28,500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కనిగిరి మండలంలో 115 పాఠశాలలు ఉండగా, వాటిలో 8,633 మంది 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. ఆ మేరకు ఆయా పాఠశాలల్లోని తరగతి గదుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులను, వైస్ చైర్మన్లు, చైర్మన్లను ఎన్నుకోనున్నారు.

తరగతి గదికి ముగ్గురి చొప్పున ఎన్నిక...

ఎస్‌ఎంసీకి సభ్యులను ప్రతి తరగతి గది నుంచి ముగ్గురు చొప్పున ఎన్నుకోవాలి. వారిలో ఇద్దరు తప్పనిసరిగా మహిళలు ఉండాలి. ముగ్గురిలో కూడా ఒకరు ఎస్టీ లేదా ఎస్సీ, రెండో వారు బలహీనవర్గాలు, మూడో వ్యక్తిని జనరల్ కేటగిరి నుంచి ఎన్నిక చేయాలి. పాఠశాల యాజమాన్య కమిటీలో ఆరు ఎక్స్ అఫిషియో సభ్యులు, ఇద్దరుకో ఆప్టెడ్ సభ్యులను నామినేట్ చేస్తారు.

కమిటీ సభ్యుల పదవీ కాలం...

ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ సభ్యుల పదవీ కాలం రెండేళ్లు. కమిటీ సభ్యుల్లోని పిల్లల చదువులు రెండేళ్లలోపు పూర్తయినా.. లేదా పిల్లలు మధ్యలో బడి వదిలి ఇతర పాఠశాలలకు వెళ్లినా.. వారు కమిటీలో పదవి కోల్పోతారు.

అవసరమైన చోట పోలీస్ బందోబస్తు...

ఎస్‌ఎంసీ ఎన్నికల పుణ్యమా అంటూ విద్యాలయాలు రాజకీయ వేదికలుగా మారనుండటంతో కొన్ని చోట్ల విద్యాశాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యగా అవసరమైన చోట పోలీస్ బందోబస్తు కోరుతున్నారు. మరికొన్ని చోట్ల అందిన ఇంటిలిజెన్స్ నివేదికల ప్రకారం పోలీస్ అధికారులే పాఠశాలల వద్ద ఎన్నికల సమయంలో పోలీసు సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా గత ఎన్నికల్లో ఎస్‌ఎంసీ ఎన్నికల్లో వివాదాలు, సమస్యాత్మకంగా ఎన్నికలు జరిగిన పాఠశాలల వద్దే పోలీసులు ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు సమాచారం.

> **ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఏర్పాట్లు :**
> పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలను అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రశాంతగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఆ మేరకు ఎన్నికల షెడ్యూల్, తదితర వివరాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాం. గతంలో ఎన్నికల సమయంలో వివాదాస్పదంగా మారిన, సమస్యాత్మకంగా ఉన్న పాఠశాలల నివేదికలను పోలీస్ అధికారులకు తెలియజేశాం. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అన్ని చర్యలు తీసుకున్నాం.
> డీవీ సుబ్బారావు, ఎంఈఓ

శిశువుకు తల్లిపాలతోనే ఆరోగ్యం


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు


లింగారెడ్డిపల్లిలో ర్యాలీలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి


తల్లిపాలపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కనిగిరి రూరల్: శిశువుకు తల్లి పాలు ఎంతో ఆరోగ్యం ఆయుష్షు అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.పార్వతి తెలిపారు. మండలంలోని లింగారెడ్డిపల్లి క్లస్టర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు జరిగే పథకాలు, పౌష్టికాహారం వలన కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ సరస్వతి, బి.ధనమ్మ, కే జ్యోతి, వి.భాగ్యలక్ష్మి, టీ శాంతమ్మ, నాగూల్ మీరా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చాకిరాలలో...

తల్లిపాల వారోత్సవాలను మండలంలోని చాకిరాల గ్రామంలో బుధవారం నిర్వహించారు. సూపర్‌వైజర్ మల్లేశ్వరి తల్లిపాల విశిష్టతను వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు దీపిక, జ్యోతి, జరినా, మాధవి, ఆరోగ్య సిబ్బంది ఆదిలక్ష్మి, సౌజన్య, వెంగమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు మొదటి టీకా...

సీఎస్ పురం (పామూరు): తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా అని, తల్లిపాలు బిడ్డలకు దివ్య ఔషధంతో సమానమని ఎంపీపీఎస్ ఆనికాలపల్లి హెచ్‌ఎం భారతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృపావరం అన్నారు. మండలంలోని ఆనికాలపల్లిలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్త సహనాజ్ అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. అనంతరం గ్రామంలో తల్లిపాల ఆవశ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భారతి, నారాయణం అలేఖ్య, ఏఎన్‌ఎం ఆంథోనమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఆశాజ్యోతి, అంగన్‌వాడీ హెల్పర్లు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రావిగుంటపల్లె, బుక్కాపురం గ్రామాల్లో...

పామూరు: మండలంలోని రావిగుంటపల్లె, బుక్కాపురం గ్రామాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం వీఎస్ పార్వతి, గోళ్ల పద్మజ ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారం పంపిణీ చేసి ర్యాలీ నిర్వహించారు. ఎన్‌జీఓ షేక్.నాయబ్‌రసూల్, ఎంఎల్‌హెచ్‌పీ కే ఆశాజ్యోతి, ఏఎన్‌ఎం నాజుని, కార్యకర్త జి.కళావతి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

హనుమంతునిపాడులో...

హనుమంతునిపాడు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్ పరిధిలో బుధవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కె.లలిత పాల్గొని మాట్లాడారు. బిడ్డ పుట్టిన అరగంటలోపే తల్లిపాలు పట్టించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు షేక్ గౌస్‌నిసాబేగం, జి.కృపావరం, అంగన్‌వాడీ కార్యకర్తలు యక్కంటి రాధమ్మ, తిరుపతమ్మ, ఆయాలు, ఏఎన్‌ఎంలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తల్లిపాలు అత్యంత శ్రేష్టమైనవి

లింగసముద్రం: తల్లిపాలు బిడ్డకు అత్యంత శ్రేష్టమైనవని పెదపవని సెక్టార్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి, లింగసముద్రం సెక్టార్ సూపర్‌వైజర్ రాధాదేవి అన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ముత్యాలపాడు, యర్రారెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలలో రోగనిరోధక శక్తి పెంచే ఔషధ గుణాలు ఉంటాయన్నారు. ముర్రుపాలు బిడ్డకు తప్పనిసరిగా తాగించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.


బుక్కాపురంలో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, ఎన్‌జీఓ


హనుమంతునిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తల్లిపాల వారోత్సవాలు

వలేటివారిపాలెం: మండలంలోని బొంతవారిపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో రెండో సెక్టర్ సూపర్‌వైజర్ సునీత ఆధ్వర్యంలో ప్రపంచ తల్లి పాలు వారోత్సవాలు బుధవారం నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకతపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యాకర్తలు వెంకటేశ్వరమ్మ, రమాదేవి, మనోహర, ఆశావర్కర్ అమూల్య, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా అధికారులు ఉండాలి


ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

పీసీ పల్లి: ప్రజలకు జవాబుదారీగా అధికారులు ఉండాలని కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి కోరారు. బుధవారం ఎంపీపీ అత్యాల జపన్య అధ్యక్షతన నిర్వహించిన పీసీ పల్లి మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని పలు సమస్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండలానికి గత 6 సంవత్సరాల నుంచి రామతీర్థం జలాలు సరఫరా చేయకుండా నిధులు స్వాహా చేసిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధుల స్వాహాపై మోహన్‌రావుపై కేసులు నమోదు చేసి విచారణ చేయిస్తానని, నిధులు రాబడతానని హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామాలకు సురక్షిత జలాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. మండలంలో జరిగిన వాటర్‌షెడ్ అక్రమాలు, పనుల తాలూరా నిధులు డ్రా చేస్తున్న నాగేశ్వరరావుపై కూడా విచారణ చేయిస్తానని హెచ్చరించారు. ఈ సందర్భంగా మండలానికి 25 యూనిట్ల రేకుల షెడ్లు మంజూరయ్యాయని ఉపాధి హామీ అధికారులు తెలిపారు. అనంతరం కేజీబీవీలో నిర్మించబోతున్న గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం పీసీ పల్లి హైస్కూల్, కస్తూరిబా, జూనియర్ కళాశాలలను పరిశీలించి మొక్కలు నాటారు. ఇళ్లపై నుంచి వెళ్లే విద్యుత్ లైన్లన్నింటికీ మరమ్మతులు చేయిస్తానని తెలిపారు. అనంతరం పలు సమస్యలకు సంబంధించి ఎమ్మెల్యేకు ప్రజలు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్బారావు, ఎంఈఓలు శ్రీనివాసాచారి, సంజీవ్, పీఆర్ ఏఈ తిరుపాలయ్య, సర్పంచ్‌లు పరిమి వెంకట్రావు, మరియమ్మ, ఎంపీటీసీలు మల్లెల సుజాత, స్వప్నకుమారి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌పై శిక్షణ కార్యక్రమం

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నుంచి మూడు రోజులపాటు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.జలజాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

కనిగిరి డివిజన్‌లో 163.8 మిల్లీమీటర్ల వర్షపాతం

కనిగిరి రూరల్: కనిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 13 మండలాల్లో 163.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, సరాసరినా 12.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు బుధవారం అధికారులు తెలిపారు. నియోజకవర్గంలోని కనిగిరి మండలంలో 32.0 మిల్లీమీటర్లు, వెలిగండ్లలో 14.4, హెచ్‌ఎం పాడులో 20, పామూరులో 22.2, పీసీ పల్లిలో 44.8, సీఎస్ పురంలో 4.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉలవపాడు: ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాయి హైస్కూల్ కరస్పాండెంట్ వెంకటశేషమ్మ, ప్రిన్సిపల్ మౌనిక తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఆగస్టు 27 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎలాంటి విద్యార్హత లేకున్నా పదో తరగతి పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 10 పాస్ అయిన వారు మాత్రమే ఇంటర్మీడియెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 9491646424, 8121977213 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మర్లపాడు విద్యార్థులు


పోటీలకు ఎంపికైన విద్యార్థులు

టంగుటూరు: జిల్లా స్థాయి సాఫ్టబాల్ జూనియర్స్ జట్టుకు మండలంలోని మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బాలుర విభాగంలో ఎ.ప్రణయ్, ఎ.అరుణ్, వై.నరసింహ, బాలికల విభాగంలో కె.హేమలత, ఎస్‌కే సాధియా, ఎ.అను ఎంపికయ్యారు. వీరు ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు శ్రీకాకుళంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం నరసరాజు తెలిపారు. విద్యార్థులను పీడీ కౌసల్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ గేమ్స్‌కు విద్యార్థుల ఎంపిక

లింగసముద్రం: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ గేమ్స్‌లో ఆడేందుకు కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం యు.మాధవరావు బుధవారం తెలిపారు. ఈ నెల 6న ఒంగోలులోని ఏబీఎం కళాశాల మైదానంలో జరిగిన పోటీల్లో పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సీహెచ్ వెంకటేష్, పి.ప్రతిమ ప్రతిభ కనబరచడంతో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెలెక్టర్లు వీరిని రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ ఆటల్లో ఆడేందుకు ఎంపిక చేసినట్లు హెచ్‌ఎం చెప్పారు. విద్యార్థులను హెచ్‌ఎం యు.మాధవరావు, పీడీ మంగతాయారు, ఉపాధ్యాయులు అభినందించారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రూ.33 లక్షలతో పూడికతీత పనులు

- కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్


పూడికతీత పనులను పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన కాలువలతో పాటు పెద్ద డ్రైనేజీల్లో రూ.33 లక్షలతో పూడికతీత పనులు చేయిస్తున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ తెలిపారు. పట్టణంలో జరుగుతున్న పూడికతీత పనులను చైర్మన్ అబ్దుల్ గఫార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దశాబ్దాలుగా కాలువల్లో కూరుకుపోయిన చెత్తాచెదారం వలన కాలువల్లో మురికినీరు పారడం లేదని తెలిపారు. కాలువల్లో పూడికతీత పనులతో మురికినీటి ప్రవాహం సక్రమంగా జరుగుతుందని వివరించారు. ప్రధాన కాలువలు శుభ్రం చేయడం వలన వర్షం నీరు ఆగకుండా పారుతోందని, మురికినీరు కాలువల్లో నిల్వ ఉండకుండా వెళ్తుందని అన్నారు. తద్వారా పారిశుధ్యం సమస్య కొంతమేరకు పరిష్కారమై దోమల వ్యాప్తి కూడా తగ్గుతుందన్నారు. డ్రైనేజీ చిన్న కాలువలను కూడా పూర్తి స్థాయిలో శుభ్రం చేసేందుకు ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని గ్రేడ్ల పొగాకుకు మంచి ధర అందించాలి


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు


కొండపిలో వేలాన్ని పర్యవేక్షిస్తున్న సునీల్ కుమార్

టంగుటూరు: వ్యాపారులు అన్ని గ్రేడ్ల పొగాకుకు మంచి ధర అందించాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రానికి జమ్ములపాలెం, తుమాడు గ్రామాల రైతులు 884 బేళ్లు తీసుకురాగా 771 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 113 పొగాకు బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ. 205, సరాసరి ధర రూ.322.03 పలికింది. వేలంలో మొత్తం 46 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

1056 బేళ్ల కొనుగోలు

కొండపి(సింగరాయకొండ): కొండపి వేలం కేంద్రంలో బుధవారం 1056 పొగాకు బేళ్లు కొనుగోలయ్యాయి. కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు 1219 బేళ్లను వేలానికి ఉంచగా వ్యాపారులు వివిధ కారణాలతో 163 బేళ్లను తిరస్కరించారని నిర్వహణాధికారి సునీల్‌కుమార్ తెలిపారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.280.23 పలికిందని, వేలంలో 18 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని వివరించారు.

బీపీ మండల్ కమిషన్ నివేదికను అమలు చేయాలి


బీపీ మండల్‌కు నివాళి అర్పిస్తున్న బీసీ నాయకులు

కందుకూరు: వెనుకబడిన వర్గాల అభివృద్ధికి మండల్ కమిషన్ నివేదికలోని అంశాలన్నిటినీ అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కళ్లగుంట మోహన్‌రావు కోరారు. బీపీ మండల్ కమిషన్ నివేదిక వచ్చి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక బీటీఏ కార్యాలయంలో మండల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల్ కమిషన్ చైర్మన్ బిందేశ్వర ప్రసాద్ మండల్ సుదీర్ఘ విచారణ అనంతరం తన నివేదికలో బీసీలకు సంబంధించిన 40 అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి తన నివేదికను 1980లో సమర్పించారని, దాదాపు పదేళ్ల నివేదికను పక్కన పెట్టిన ప్రభుత్వాలు 1990లో వీపీ సింగ్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు మండల్ కమిషన్ నివేదిక అమలుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. కానీ విద్యా, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఒకే ఒక అంశాన్ని మాత్రమే అమలు చేశారని, మిగిలిన అంశాల గురించి ఇప్పటి వరకు ప్రభుత్వాలు పట్టించుకోలేదని వివరించారు. బీటీఏ డివిజన్ అధ్యక్షుడు కళ్లగుంట మోహన్‌రావు మాట్లాడుతూ కులగణన చేయడం ద్వారా మాత్రమే బీసీల సమగ్రాభివృద్ధి జరుగుతుందని, వెంటనే దేశ జనాభాను కులగణన చేయాలని కోరారు. కార్యక్రమంలో లింగసముద్రం మండల ప్రధాన కార్యదర్శి పత్రే వెంకట్రావ్, సీనియర్ నాయకులు టీ గంగయ్య, కొచ్చెర్ల వెంకటేశ్వర్లు, కొప్పులు ఆదాము, కరేటి వెంకటేశ్వర్లు, సన్యాసి మాల్యాద్రి, బాంసెఫ్ వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతం


పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ ఇర్విన్


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జ్వాలా నరసింహారావు

- ఆర్డీఓ ఇర్విన్

సీఎస్ పురం (పామూరు): మండలంలో కౌలు రైతుల గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియను వీఆర్‌ఓలు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తిచేయాలని కనిగిరి ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మండలంలోని వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఉంటే వారు ప్రభుత్వం అందించే రాయితీలు పొందే అవకాశం ఉంటుందని, ఈ విషయాన్ని వీఆర్‌ఓలు గుర్తెరగాలని సూచించారు. 544జీ బీకేవీ గ్రీన్‌ఫీల్డ్ హైవే, 167బీ జాతీయ రహదారిలో భూములు కోల్పోయి పరిహారం పెండింగ్‌లో ఉన్న వారికి త్వరితగతిన పరిహారం ఇచ్చేందుకు రికార్డులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అంబవరం, క్రిష్ణంనాయునిపల్లె గ్రామాల వద్ద కన్వర్షన్ కోసం కొందరు దరఖాస్తు చేసుకున్న పొలాలను పరిశీలించారు. అదేవిధంగా అంబవరం కొత్తపల్లెవద్ద సర్వేనంబర్ 76లో జాతీయ రహదారివారు ఏర్పాటు చేసుకోదలచిన పెట్రోల్‌బంక్‌కు స్థల పరిశీలన చేశారు. ఆయన వెంట ఆర్‌ఐ పి.శ్రీధర్‌బాబు, వీఆర్‌ఓ మాల్యాద్రి, శివ, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ కౌలు కార్డులు

మద్దిపూడి: మండలంలో అర్హులందరికీ కౌలు కార్డులు అందించాలని తహసీల్దార్ జ్వాలా నరసింహారావు సూచించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సీసీఆర్‌సీ కార్డులపై వ్యవసాయశాఖ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఖరీఫ్‌కు సంబంధించి పంట నమోదు కార్యక్రమం చేపట్టాలన్నారు. హక్కు పత్రాలు, పొలాలు పరిశీలించి కౌలు కార్డులు అందించాలని వీఆర్‌ఓలకు సూచించారు.

సీఎస్‌పురం తహసీల్దార్‌గా మంజునాథరెడ్డి

సీఎస్ పురం (పామూరు): సీఎస్ పురం తహసీల్దార్‌గా దుంపు మంజునాథరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా మాచర్లలో విధులు నిర్వహిస్తున్న ఆయన.. బదిలీపై సీఎస్ పురం వచ్చారు. ఈ సందర్భంగా మంజునాథరెడ్డి మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయనకు ఆర్‌ఐ పి.శ్రీధర్‌బాబు, స్థానిక వీఆర్‌ఓలు అభినందనలు తెలిపారు.

పామూరు తహసీల్దార్‌గా రమణారావు

పామూరు: పామూరు తహసీల్దార్‌గా బచ్చల వెంకట రమణారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రైతులు భూ సమస్యలు ఉంటే కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. పల్నాడు జిల్లా బొల్లాపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా పామూరు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, సింగిల్ విండో మాజీ చైర్మన్ బైరెడ్డి జయరామిరెడ్డి, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్

కందుకూరు: కందుకూరు తహసీల్దార్‌గా నియమితులైన సయ్యద్ ఇక్బాల్ బుధవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గత ఏడాదిగా రెగ్యులర్ తహసీల్దార్ లేక ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొచ్చారు. ఈ నేపథ్యంలో కందుకూరుకు సయ్యద్ ఇక్బాల్‌ను కలెక్టర్ నియమించారు. దీంతో ఆయన తహసీల్దార్ కార్యాలయంలో విధుల్లో చేరారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: విద్యార్థులు, యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ సూచించారు. స్థానిక కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాలలో నల్సా పథకం 2015పై, డ్రగ్స్ వాడకం–వాటి దుష్పరిణామాలపై మండల న్యాయ సేవాధికార సంస్థ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ యువత, విద్యార్థులు చెడువ్యసనాలకు బానిసై జీవితాలను నాశం చేసుకోవద్దని చెప్పారు. డ్రగ్స్ మహమ్మరి నేడు ప్రపంచాన్ని పట్టిపీడిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ మాదక ద్రవ్యాల వాడకం వలన ఆరోగ్యపరంగా, మానసికంగా, ఆర్థికంగా నాశనం అవ్వడమే కాకుండా చట్టరీత్యా శిక్షార్హులు అవుతారన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పాశం పిచ్చయ్య, కాలేజీ ప్రిన్సిపాల్ కిషోర్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు రమేష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, న్యాయసేవాధికార సంస్థ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్